## ప్రభుత్వానికి.. థ్యాంక్స్



ఇర్ఫాన్‌కు కారు అందజేసిన మంత్రి తలసానిశ్రీనివాస్ యాదవ్

బన్సీలాల్‌పేట్, సెప్టెంబర్ 30 : యువత స్వయం ఉపాధి కల్పనకు ప్రభుత్వం అన్ని విధాలుగా ప్రోత్సహిస్తుందని మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. న్యూబోయిగూడ ముస్లిమ్ బస్తీకి చెందిన మహ్మద్ ఇర్ఫాన్ అనే యువకుడికి మైనారిటీ కార్పొరేషన్ ద్వారా మంజూరైన స్విఫ్ట్ కారును ఆయన శనివారం అందజేసి అభినందనలు తెలిపారు. బీఆర్ఎస్ మైనారిటీ సెల్ నాయకులు ఎం.డి.అబ్బాస్, షేక్ జహంగీర్‌లు పాల్గొన్నారు. కొంతకాలంగా కిరాయి వాహనాన్ని నడిపిన తనకు కారు మంజూరు కావడంతో ఇకపై తాను ఓనర్‌గా మారానని, తనకు ఆర్థికంగా ప్రోత్సాహం అందించిన సీఎం కేసీఆర్, మంత్రి తలసానిలకు ఇర్ఫాన్ కృతజ్ఞతలు తెలిపాడు.

## మిలటరీ ఉద్యోగులకు క్రీడా పోటీలు



క్రీడాపోటీలను ప్రారంభిస్తున్న కోర్స్ డైరెక్టర్ శ్రీదేవి ఐలూరి

జూబ్లీహిల్స్,సెప్టెంబర్30: జూబ్లీహిల్స్‌లోని డాక్టర్ మర్రిచెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థలో శిక్షణలో ఉన్న మిలటరీ ఇంజినీరింగ్ సర్వీస్ ఉద్యోగులకు యూసుఫ్‌గూడ ఫస్ట్ పోలీస్ బెటాలియన్‌లో శనివారం క్రీడా పోటీలు నిర్వహించారు. ఎంసీఆర్ హెచ్‌ఆర్‌డీలో 14 వారాల శిక్షణలో ఉన్న అధికారులకు 100 మీ,200 మీ,400 మీటర్స్ అథ్లెటిక్స్, షాట్‌పుట్, జావెలిన్ త్రో, లాంగ్ జంప్, టగ్ ఆఫ్ వార్ తదితర క్రీడలను నిర్వహించారు. ఈ క్రీడా పోటీలను కోర్స్ డైరెక్టర్ శ్రీదేవి ఐలూరి, కోర్స్ అడ్వైజర్ డాక్టర్ కోట తిరుపతయ్య ప్రారంభించారు. అధికారులు, క్రీడాకారులు ఒలింపిక్ ల్యాంప్‌ను చేతబూని ప్రతిజ్ఞ చేశారు. సంస్థ డైరెక్టర్ జనరల్ డాక్టర్ శశాంక్ గోయల్, అడిషనల్ డైరెక్టర్ జనరల్ బెన్‌హర్ మహేష్‌దత్ ఎక్కా ఆదేశాలతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో క్రీడల సమన్వయకర్త డాక్టర్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

## చిన్నారుల్లో ఆత్మస్థైర్యం నింపుతున్న శిశువిహార్



చిన్నారులకు ఆధార్ కార్డులను అందజేస్తున్న మెట్రోపాలిటన్ సెషన్స్ జడ్జి ప్రేమావతి

వెంగళరావునగర్, సెప్టెంబర్ 30:తల్లిదండ్రుల ప్రేమకు నోచుకోని చిన్నారుల మోముల్లో శిశువిహార్ చిరునవ్వులు నింపుతుందని నాంపల్లి కోర్టు మెట్రోపాలిటన్ సెషన్స్ జడ్జి ప్రేమావతి అన్నారు.శనివారం వెంగళరావునగర్ డివిజన్ మధురానగర్ లోని స్టేట్ హోం ఆవరణలో ఉన్న శిశువిహార్‌లో ఆశ్రయం పొందుతున్న దివ్యాంగ చిన్నారులకు మెట్రోపాలిటన్ లీగల్ సర్వీసెస్ అథారిటీ సెక్రటరీ రాధిక జైస్వాల్ తో కలిసి న్యాయమూర్తి ప్రేమావతి సదరం సర్టిఫికెట్లు, బాల ఆధార్ కార్డులు అందజేశారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి ప్రేమావతి మాట్లాడుతూ..దివ్యాంగ చిన్నారుల్లో ఆత్మ స్థైర్యం కోల్పోకుండా మనో నిబ్బరం నింపడం అభినందనీయమన్నారు.చిన్నారులు బాగా చదువుకుని జీవితంలో రాణించి ఉన్నత శిఖరాలను చేరుకోవాలని ఆకాంక్షించారు. శిశువిహార్ లో ఉన్న చిన్నపాటి సమస్యలను పరిష్కరించాలని సిబ్బందికి ఆమె ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి అక్కేశ్వర్ రావు, ఎమ్మార్వో రాములు,డీపీపీ యూనిట్ సుమలత, శ్రీనివాస్, విజయ భాస్కర్, సూపరింటెండెంట్ సంతోషి తదితరులు పాల్గొన్నారు.

## మహంకాళి ఆలయం హుండీ లెక్కింపు

బేగంపేట్ సెప్టెంబర్ 30: సికింద్రాబాద్ శ్రీ ఉజ్జయినీ మహంకాళి అమ్మవారి దేవాలయం హుండీని శనివారం అధికారులు లెక్కించారు. అమ్మవారి ఆదాయం రూ. 27,30,248 లక్షల ఆదాయం వచ్చినట్టు దేవాలయం ఈవో గుత్తా మనోహర్‌రెడ్డి తెలిపారు.

# మైనార్టీల సంక్షేమానికి పెద్దపీట

- బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని ఆశీర్వదించండి
- మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్
- మైనార్టీలకు కుట్టుమిషన్లు అందజేత



ముస్లిం మహిళలకు చెక్కులు అందజేస్తున్న మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్

బేగంపేట్ సెప్టెంబర్ 30: ప్రజలకు మేలు చేసే ప్రభుత్వానికి అండగా ఉండి ఆశీర్వదిస్తే మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు జరుగుతాయని మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. శనివారం వెస్ట్ మారేడ్‌పల్లిలోని మల్టీ పర్పస్ ఫంక్షన్ హాల్‌లో ముస్లిం మైనార్టీ సంక్షేమ శాఖ అధ్వర్యంలో 300 మందికి కుట్టు మిషన్‌లు, 80 మందికి రూ.1 లక్ష చొప్పున ఆర్థిక సహాయం చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మైనార్టీల సంక్షేమం అభివృద్ధి కోసం సీఎం కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణ ప్రభుత్వం అనేక కార్యక్రమాలను అమలు చేస్తుందన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాతనే క్రిస్మస్,రంజాన్ వంటి గొప్ప గొప్ప పండుగలను ప్రభుత్వం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహిస్తున్నట్టు తెలిపారు. అంతే కాకుండా పేదలు కూడా పండుగలను గొప్పగా సంతోషంగా జరుపుకోవాలలనే ఉద్దేశంతో నూతన దుస్తులతో కూడిన గిఫ్ట్ ప్యాక్‌లను అందిస్తున్న విషయాలను గుర్తు చేశారు. మహిళలు స్వయం ఉపాధి అవకాశాలను పెంపొందించే శిక్షణ కార్యక్రమాలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. బస్తీలోని కమ్యూనిటీ హాల్స్‌లలో మరిన్ని శిక్షణ కార్యక్రమాలను ఏర్పాటు చేస్తామని చెప్పారు. అన్ని వర్గాల ప్రజల అభివృద్ధి సంక్షేమం కోసం ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. ప్రభుత్వం అమలు చేసే కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోని లబ్ధి పొందాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మైనార్టీ కార్పొరేటర్ జిల్లా అధికారి ఎలియాస్ అహ్మద్, కార్పొరేటర్లు కొలను లక్ష్మి, మాజీ కార్పొరేటర్ శేషుకుమారి, ఆకుల రూప,అరుణగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

### క్రిస్టియన్ శ్మశానవాటికల అభివృద్ధికి కృషి

బన్సీలాల్‌పేట్, సెప్టెంబర్ 30 : క్రిస్టియన్ శ్మశానవాటికల అభివృద్ధి కోసం ప్రభుత్వం కృషి చేస్తుందని మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. నియోజకవర్గ అభివృద్ధి నిధుల నుంచి కేటాయించిన రూ.1.35 కోట్ల నిధులతో న్యూబోయిగూడలోని క్యాథలిక్, వెస్లీ, బాప్టిస్ట్ శ్మశానవాటిలలో చేపట్టనున్న ప్రహరీ నిర్మాణం, పాత్‌వే, లైట్లు, నీటి సదుపాయం ఏర్పాటు పనులను శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా పలు చర్చిల పాదర్లు, పాస్టర్‌లు ప్రత్యేక ప్రార్థన నిర్వహించి, మంత్రిని ఆశీర్వదించారు. నిరుపేద ప్రజలకు, సమాజంలోని అన్ని వర్గాలను ఆదరిస్తున్న ప్రభుత్వానికి తాము మద్దతుగా ఉంటామని వారు అన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గతంలో ఎవరూ ఆలోచించని విధంగా సీఎం కేసీఆర్ అన్ని వర్గాల ప్రజల శ్మశానవాటికల అభివృద్ధిపై దృష్టి పెట్టారని అన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ హేమలత, బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు వెంకటేశన్ రాజు, జీహెచ్‌ఎంసీ జోనల్ కమిషనర్ రవికిరణ్, డీసీ శంకర్, బోయిగూడ క్యాథలిక్ శ్మశానవాటి కమిటీ అధ్యక్షుడు జయరాజ్, సభ్యులు హౌజీ టార్చర్, ఆంథోని, జ్యూడ్ పాల్, డిసిల్వ, సగాయిరాజ్, వివిధ చర్చిల పాదర్లు బాలషౌరి, ప్రతాప్, షౌరిరెడ్డి, విక్టర్, జ్ఞానప్రకాశ్, నరేశ్, బీఆర్ఎస్ సనత్‌నగర్ క్రిస్టియన్ మైనారిటీ వెల్ఫేర్ కమిటీ అధ్యక్షుడు దయాకర్, కార్యదర్శి జయరాజ్, విజయ్‌పాల్, ప్రశాంత్, సుధీర్ కుమార్, దాస్ పాల్గొన్నారు.



బోయిగూడలోని క్రిస్టియన్ శ్మశానవాటికలో అభివృద్ధి పనులను ప్రారంభించిన మంత్రి తలసాని

### కమ్యూనిటీ హాల్స్‌ను వినియోగించుకోవాలి..

బేగంపేట్ సెప్టెంబర్ 30: పేదల అవసరాల కోసమే బస్తీలలో కమ్యూనిటీ హాల్స్‌ను నిర్మిస్తున్నట్టు మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ తెలిపారు. శనివారం రాంగోపాల్‌పేట్ డివిజన్‌లోని మేకలబండలోని కమ్యూ నిటీ హాల్‌పై రూ. 22 లక్షలతో నిర్మాణం చేపట్టనున్న మెదటి అంతస్తు నిర్మాణం పనులు, నల్లగుట్ట జే లైన్‌లో రూ. 50 లక్షలు నియోజకవర్గం నిధులు, జీహెచ్‌ఎంసీ మరో రూ. 50 లక్షలతో జీప్లస్ విధానంలో చేపట్టనున్న కమ్యూనిటీ హాల్ నిర్మాణం పనులు, అలాగే చుట్టాల బస్తీలో కమ్యూనిటీ హాల్‌పై రూ. 12 లక్షల తో చేపట్టనున్న మొదటి అంతస్తు నిర్మాణ పనులను మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జే లైన్‌లో శిథిలావస్థలో ఉన్న భవనాన్ని తొలగించి నూతన భవనం నిర్మించడం జరుగుతుందని బస్తీ ప్రజల అవసరాల కోసం వినియోగించుకునే విధంగా పనులు జరుగుతాయని చెప్పారు. కార్యక్రమంలో జోనల్ కమిషనర్ రవికిరణ్, డీసీ శంకర్, ఈఈ సుదర్శన్ బీఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# మైనార్టీల జీవితాల్లో వెలుగులు

బంజారాహిల్స్, సెప్టెంబర్ 30 : మైనార్టీల సంక్షేమం కోసం అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టిన బీఆర్ఎస్ ప్రభుత్వం వారి జీవితాల్లో వెలుగులు నింపుతుందని ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ అన్నారు. మైనార్టీ కార్పొరేషన్ ఆధ్వర్యంలో మైనార్టీ మహిళల కోసం కుట్టు మిషన్ల పంపిణీ కార్యక్రమంలో భాగంగా యూసుఫ్‌గూడ డివిజన్‌కు చెందిన లబ్ధిదారులకు శనివారం ఎమ్మెల్యే మాగంటి చేతులమీదుగా కుట్టు మిషన్లు అందజేశారు. పేదరికంతో బాధపడుతున్నా ఇంట్లోంచి బయటకు వెళ్లి ఉద్యోగం చేసుకోలేని ముస్లిం మహిళల ఇబ్బందులను గుర్తించిన ప్రభుత్వం వారికి కుట్టు మిషన్లు అందించాలని నిర్ణయించిందన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ రాజ్ కుమార్ పటేల్, డివిజన్ అధ్యక్షుడు సంతోష్ ముదిరాజ్, ప్రధాన కార్యదర్శి నర్సింగ్‌దాస్, ఇమామ్యా బేగం, సయ్యద్ రేష్మా, షేక్ మీటాబీ తదితరులు పాల్గొన్నారు.



ముస్లిం మహిళలకు కుట్టుమిషన్లు అందజేస్తున్న ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్

## 4 న ఓటరు జాబితా విడుదల

జూబ్లీహిల్స్,సెప్టెంబర్30: నూతన ఓటరు జాబితా ఫైనల్ పబ్లికేషన్ ఈనెల 4 న విడుదల కానున్నట్లు.. రాజకీయ పార్టీల ప్రతినిధులు ఓటరు జాబితాపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని జూబ్లీహిల్స్ ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్, డిప్యూటీ కమిషనర్ చంద్రశేఖర్ పేర్కొన్నారు. శనివారం యూసుఫ్‌గూడ జీహెచ్‌ఎంసీ 19 వ సర్కిల్ కార్యాలయంలో ఆర్డీవో శివ కుమార్‌తో కలిసి అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులతో అఖిలపక్ష సమావేశం నిర్వహించారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు నూతన ఓటరు జాబితాను జీహెచ్‌ఎంసీ కార్యాలయంలో అందుబాటులో ఉంచుతామని వెల్లడించారు. అసిస్టెంట్ రిటర్నింగ్ ఆఫీసర్‌లు.. టౌన్ ప్లానింగ్ ఏసీపీ రాణి, అసిస్టెంట్ మున్సిపల్ కమిషనర్ కమల్, ప్రతినిధులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఈఆర్వో చంద్రశేఖర్, ఆర్డీవో శివ కుమార్

## విద్యార్థినులకు సైకిళ్లు అందజేత



ఒరాకిల్ వారి ఆర్థిక సహాయంతో సనత్‌నగర్‌లోని ప్రభుత్వ పాఠశాల (ఓల్డ్)లో చదువుతున్న విద్యార్థినులు 10 మందికి సనత్‌నగర్‌కు చెందిన నిర్మాణ్ సంస్థ సైకిళ్లను అందించారు. విద్యార్థినుల వారి సౌలభ్యం కోసం ఈ సైకిళ్లను అందించడం జరిగిందని సంస్థ అధ్యక్షుడు ఇమ్రాన్ తెలిపారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు మేరీ తదితరులు పాల్గొన్నారు. –అమీర్‌పేట్, సెప్టెంబర్ 30